క్లుప్తంగా

గుండెపోటుతో మహిళ మృతి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్న మహిళ గుండె పోటుతో మృతి చెందిన సంఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం ధర్మపురం గ్రామానికి చెందిన గుజ్జుల పద్మ(40) గర్భసంచి సమస్యతో బాధ పడుతూ చికిత్స కోసం పట్టణంలోని డాక్టర్స్ కాలనీలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో 10రోజుల క్రితం చేరింది. ఆపరేషన్ అనంతరం కోలుకున్న తరువాత డిశ్చార్జి చేశారు. సోమవారం సాయంత్రం ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయింది. గమనించిన ఆస్పత్రి వైద్యులు సీపీఆర్ చేసి దగ్గర్లో ఉన్న గుండె వైద్య నిపుణులు కలిగిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ఆస్పత్రి వద్దకు రాగా, తన భార్య మృతికి వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని బంధువులకు చెప్పి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మార్కెట్ కమిటీ రిజర్వేషన్లల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఒకసారి ఎస్సీ, మరోసారి ఎస్టీ, ఆ తరువాత జనరల్‌గా రిజర్వేషన్లు ఇవ్వడం జరిగిందని, ఈ సారి జనరల్ మహిళకు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. జనరల్ స్థానంలో సామాజిక న్యాయం పాటించి కాంగ్రెస్ పార్టీ బీసీలకు చైర్మన్ ఇచ్చి గౌరవించాలన్నారు.

పాఠశాలకు బోరు మోటారు బహూకరణ

గుర్రంపోడు : మండలంలోని పాల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మల్లెపల్లికి చెందిన వ్యాపారి సముద్రాల వెంకన్న వన్ హెచ్‌పీ విద్యుత్ మోటారును బహూకరించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా విద్యుత్‌మోటారును అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గిరి ధనుంజయ గౌడ్, పాఠశాల హెచ్‌ఎం కుకుడాల శ్రీనివాస్, టీచర్లు, సీఆర్పీ ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ

మిర్యాలగూడ : బ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ స్థాయిలో బోయినపల్లి వెంకటరమణశాస్త్రి అధ్యక్షతన క్రోధినామ సంవత్సర పంచాంగాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం శివాలయంలో ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఆలయ చైర్మన్ బండారు కుశలయ్య, మురళీశర్మ, ఆదిత్య, పరసాద్, రాధాకృష్ణశర్మ, కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, పూర్ణయ్య, లక్ష్మీనారాయణశర్మ, వేణుగోపాల్‌రావు, యాదగిరి, రామ్మోహన్‌రావు, సీతారామశర్మ పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర

పెద్దవూర : మండలంలోని పొట్టిచల్మ ఎక్స్ రోడ్డు వద్ద పవిత్ర కృష్ణానది సమీపంలో భక్తుల పాలిట కొంగు బంగారంగా కొలువై ఇష్టమైన కోర్కెలు తీర్చే వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ జాతర నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీప జిల్లాల నుంచి భక్తులు వనదేవతలను సందర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పిస్తుంటారు. సమీప గ్రామాల ప్రజలు సైతం జాతరకు అధిక సంఖ్యలో తరలివస్తారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ


కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి : స్థానిక ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పి. కరుణాకర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తునన మసూద్ షరీఫ్ సంగారెడ్డి జిల్లా రాయకోడ్ మండలానికి బదిలీకాగా ఆయన స్థానంలో మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి కరుణాకర్‌రావు అడవిదేవులపల్లికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కరుణాకర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీఓగా మోసిన్

అడవిదేవులపల్లి ఎంపీఓగా మంగళవారం మోసిన్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎంపీఓ జె.లలితసుబ్బారెడ్డి, వేములపల్లి మండలానికి బదిలీకాగా ఆమె స్థానంలో దామరచర్ల మండల ఎంపీఓ పనిచేస్తున్న ఎండీ మోసిన్ అడవిదేవులపల్లికి బదిలీపై వచ్చి బాధ్యతలను స్వీకరించారు.

మతసామరస్యానికి ప్రతీక

హజరత్ అబ్బాస్ దర్గా ఉర్సు

- వివిధ జిల్లాల నుంచి తరలిరానున్న భక్తజనం
- హాజరుకానున్న పలువురు ఐఏఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఒకేసారి భక్త మహేశ్వరుడి కల్యాణం, ఉర్సు నిర్వహణ ప్రత్యేకత



విద్యుత్ దీపాల అలంకరణలో హజరత్ అబ్బాస్ దర్గా

చింతపల్లి : దర్గా ముత్తువలి మహమ్మద్ చాంద్ పాషా - లతీఫ్ సాబ్ నల్లగొండ జిల్లాలో రెండో జాన్‌పహాడ్‌గా భావించే హజరత్ అబ్బాస్ దర్గా ఉర్సుకు ముస్తాబైంది.. చింతపల్లి మండలం పీకేమల్లేపల్లిలో కొలువై ఉన్న ఈ దర్గా 55వ ఉర్సు బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉర్సుకు మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, ప్రకాశం, ఖమ్మం, వరంగల్, మెదక్ తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

ఓ వైపు ఉర్సు మరో వైపు భక్త మహేశ్వరుడి కల్యాణం

అజహరత్ అబ్బాస్ దర్గా కింది భాగంలో ఉండగా, గుట్ట పైభాగంలో శ్రీగిరి భక్త మహేశ్వరస్వామి ఆలయం ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ ఓ వైపు భక్త మహేశ్వరస్వామి ఉత్సవాలు, మరో వైపు దర్గాలో ఉర్సు జరగడం ఇక్కడి ప్రత్యేకత. హిందూవులు, ముస్లింలులు మక్క మహేశ్వరస్వామి కల్యాణం, ఉర్సులో పాల్గొంటుంటారు. హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా ఈ దర్గా నిలిచింది. దర్గాకు వచ్చే భక్తులు మొదటగా కింది భాగంలో ఉన్న అజహరత్ అబ్బాస్ దర్గాను దర్శించుకొని పైభాగంలో ఉన్న భక్త మహేశ్వరుడిని దర్శించుకుంటారు. గుట్టపై శ్రీ వినాయక స్వామి, మహేశ్వరస్వామి, ఉమామహేశ్వర దేవి, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు నవ విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాల సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన 75 అడుగుల ఎత్తు గల మక్క మదీన శివలింగం నమూనల అలంకరణలు భక్తులను అమితంగా ఆకర్షిస్తాయి. విద్యుత్ దీపాలతో రంగులు అద్దే కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

దర్గాకు వెళ్లే మార్గం

చింతపల్లి మండలం మాల్, కుర్మేడు, కుర్రంపల్లి, సాయిరెడ్డి, మొద్దులమల్లేపల్లి మీదుగా బస్సు సౌకర్యం ఉంది. ఈ ఉర్సు సందర్భంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. దర్గా నిర్వాహకులతో పాటు అన్ని శాఖల అధికారులతో దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు ఇప్పటికే సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు. ప్రతీ ఏడాది మాదిరిగానే వివిధ ప్రాంతాల నుంచి ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా మూడు రోజుల పాటు నిర్వహిస్తుంటారు.

ఉర్సుకు ఏర్పాట్లు పూర్తి

మూడు రోజుల పాటు జరిగే ఉర్సుకు ఖలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్గా నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. రాజ్య సభ సభ్యులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బాలునాయక్ ఆర్థిక సదుపాయంతో మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

హాజరుకానున్న మంత్రులు, ఐఏఎస్ అధికారులు

అజహరత్ అబ్బాస్ దర్గా ఉర్సులో 54ఏళ్ల నుంచి ఈ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు తప్పనిసరిగా హాజరుకావడం ఆనవాయితీగా వస్తోంది. ఐఏఎస్, ఐపీఎస్, ప్రజాప్రతినిధులు ఉర్సుకు హాజరుకానున్నారు.

కార్యక్రమ వివరాలు..

బుధవారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు భక్తజన సందోహంతో ఒంటెపై గంధం ఊరేగింపు, ఉదయం 8 గంటలకు శ్రీగిరి భక్త మహేశ్వర స్వామి కల్యాణోత్సవం, 23న భక్తుల దీపారాధన, కందూళ్లు నిర్వహిస్తారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనమైన చరిత్ర

సుమారు 55 ఏళ్ల క్రితం భగవాన్ మహమ్మద్ దర్గా ముత్తువలి మహమ్మద్ చాంద్ పాషా వచ్చి దర్గాను నిర్మించాలని ఆదేశించాడు. దేవుడి ఆదేశం ప్రకారం.. వెంటనే పీకేమల్లేపల్లి సమీపంలోని గుట్టపై దర్గాను నిర్మించారని స్థానికులు పేర్కొంటున్నారు. ఉర్సు ప్రారంభం రోజు దర్గా ముత్తువలి లతీఫ్ సాహెబ్ గులాబి పూలను లడ్డూలుగా మార్చినట్లు, నీటితో దీపాలు వెలిగించినట్లు ఇక్కడ ప్రచారంలో ఉంది. దర్గాకు ఎలాంటి ఇనాం భూములు, ఆదాయ మార్గాలు లేవు. భక్తుల వద్ద సేకరించిన విరాళాలతోనే ఈ ఉత్సవాలను నిర్వహిస్తుంటారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీడీపీఓ గంధం పద్మావతి

నిడమనూరు : మానవ అక్రమ రవాణాపై బాలికలకు అవగాహన ఎంతో అవసరమని సీడీపీ గంధం పద్మవతి అన్నారు. స్థానిక కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం స్వరక్షా డే సందర్భంగా మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సుల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే పెద్ద నేరంగా ఉందని, ప్రతి రోజూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురి అవుతున్నారని తెలిపారు. సినిమాల్లో ఛాన్స్ ఇప్పిస్తామని, ఇతర ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి అమాయక బాలికలకు, మహిళలఉ విదేశాలకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాల్లో బాలికలు, మహిళలు ఎంతో అవగాన కలిగి ఉంటే మోస పోకుండా తమను తాము రక్షించుకోగల్లుతామని వివరించారు. ప్రజలు స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సురేశ్ మాట్లాడారు. స్మార్ట్ ఫోన్‌ల వినియోగం సందర్భంగా వచ్చే మెసేజ్‌లు, లింక్‌లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా 28 సంవత్సరాలుగా 28,200మంది అమ్మాయిలను కాపాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ కో ఆర్డినేటర్స్ అనిల్‌కుమార్, అంబర్ సింగ్, మిథాలిరాజ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సరిత



మిర్యాలగూడ టౌన్ : బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన కొండేటి సరితను నియమిస్తూ ఆ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఎం.శిల్పారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కొండేటి సరిత మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి స్థాయిలో అధ్యాయనం చేసి వాటి పరిష్కారానికి రాజీలేని ఉద్యమాలను చేపడతానన్నారు. తాను నిబద్ధతతో పార్టీ అభివృద్ధికి పని చేయడం వలన తనను ఈ పదవికి ఎంపిక చేశారని, దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డిలతో పాటు రాష్ట్ర, జిల్లా పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల మహిళా మోర్చాల నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో పాటు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ప్రధానంగా పారిశుద్ధ్య వ్యవస్థ, నర్సరీలు, ప్లాంటేషన్లు, మంచినీటి సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగు పరిచేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అదే విధంగా నర్సరీలు, ప్లాంటేషన్లపై కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ మోసిన్, సీనియర్ అసిస్టెంట్ అమీర్‌అలీ, ఈసీ శంకర్, పంచాయతీ కార్యదర్శులు వాసుదేవారెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం

దేవరకొండ : పట్టణం కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం దేవరకొండ అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర స్థాయి సమావేశానికి తెలంగాణ రాష్ట్రంలోని 33జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 120మంది సభ్యులు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు పంగునూరి లింగయ్య,కంచర్ల నారాయణ రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఐజాక్, వసంత, యూసుఫ్‌షరీఫ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పెద్దవూర : మండలంలోని నీమానాయక్‌తండాకు చెందిన కీచ్యాసాద్ మఠం ప్రధాన అర్చకుడు రమావత్ ధాన్యానాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం ధాన్యానాయక్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా ఊరబావితండాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షురాలు రమావత్ శ్రీదేవి కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవినాయక్, నాయకులు శివాజీ, శ్రీకర్, గోపి, లక్ష్మణ్, ముని, నిరంజన్, నగేష్, రమేష్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

త్రిపురారం: మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధి కోమటిగూడెంలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. గ్రామస్తులు వివరాల ప్రకారం.. కోమటిగూడెం గ్రామానికి చెందిన ఆలంపల్లి నాగయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో గుడిసెకు నిప్పు అంటుకొని పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘ టనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించా రు. జానయ్య కుటుంబానికి గ్రామానికి చెందిన కొండా భాస్కర్ రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

దేవరకొండ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం ఆర్డీఓ తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 22న దేవరకొండలో నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, గిరిజన సంఘం నాయకులతో అంశాలపై చర్చించారు. సేవాలాల్ జయంతిని విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.అనంతరం జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆయా మండలాల అధికారులకు ఆయన పలు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శివ వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

హాలియా : మున్సిపాలిటీ కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వ సమీపంలో శివ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం మహోత్సవం మంగళవారం కనుల పండవగా జరిగింది. అర్చకులు బ్రహ్మశ్రీ గొట్టిముక్కల నర్సింహ్మాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారిని హాలియా పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ చెన్నోజు మోహనా చారి, ప్రధాన కార్యదర్శులు శంకరాచారి, కొండలాచారి, ఉపాధ్యక్షులు సత్తయ్యచారి, కలకుంట్ల కోటాచారి, సత్య నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడం అభినందనీయం


హాలియా : మెగా జాబ్ మేళాను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

హాలియా : నిరుద్యోగ యువతకు ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టబోయిన అనిల్‌కుమార్ జాబ్ మేళా ద్వారా ఉపాధి కల్పించడం అభినందనీయమని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ఎడ్రిబ్జ్, క్వెస్ క్రాప్ లిమిటెడ్, బ్రిడ్జ్ లెక్ లిమిటెడ్, మారుతి సుజుకి, డీమార్ట్ లిమిటెడ్, యురేక పోబ్స్ తదితరల కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరైయ్యాయి. జాబ్ మేళాలో 300మందికి పైగా యువత హాజరు కాగా అందులో 200 మంది ఎంపికయ్యారు. ముందుగా ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా జాబ్ మేళాను మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, సాగర్ ఎడమ కాలువ మాజీ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి, సీనియర్ నాయకులు భిక్షం యాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాంబాబు యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ నారాయణగౌడ్, కంపెనీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పెద్దవూర : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చలకుర్తి గ్రామంలోని మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి 336వ ఆరాధన ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో స్వామి వార్లకు కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. నేరెడుగొమ్ము మండలంలో మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పర్యటించారు. మండలంలోని తిమ్మాపురం, చెంచు కాలనీ, నేరెడుగొమ్ము, కొత్తపల్లి, మోసంగడ్డతండా, పెద్దమునిగల్ గ్రామాల్లో దాదాపు రూ.50లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మోసంగడ్డ తండాలో నూతనంగా నిర్మించే గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం కాచరాజుపల్లి బర్మాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గువ్వలగుట్ట గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. మండలంలోని సమస్యలు పరిష్కరించి ప్రజలకు మేలు చేస్తానన్నారు. అనంతరం గువ్వలగుట్టలో నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, వెంకటయ్య, లబిక్కనాయక్, పాపానాయక్, రమేశ్, యుగేందర్‌రెడ్డి, బస్వారెడ్డి, వెంకటయ్య, సోమాణి, నరహరి, హరికృష్ణ, సుభాష్‌నాయక్ పీఆర్ ఏఈ రాజునాయక్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భయాన్ని వీడాలి


పెద్దవూర : మాట్లాడుతున్న ఏటీడీఓ లక్ష్మారెడ్డి

హాలియా : విద్యార్థులు భయాన్ని వీడి విజయం కోసం కష్టపడాలని వ్యక్తిత్వం వికాస నిపుణుడు టీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వీఎస్ఆర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 'విజయ సాధన, ప్రేరణ, ఏకాగ్రత' తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి గదిలో గురువులు బోధించిన పాఠాలను శ్రద్ధగా గుర్తుపెట్టుకొని పరీక్షలో అడిగిన ప్రశ్నలకు జవాబులు రాయాలన్నారు. విద్యార్థులు బట్టీ చదువులు కాకుండా విషయ పరిజ్ఞానంతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని పాఠ్యాంశాలలోని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఆర్ పాఠశాల ప్రిన్స్‌పాల్ శివర్ల వెంకటయ్య, ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, సాయిరాం రెడ్డి, జానయ్య, సాయికుమార్, నాగయ్య, జ్యోతి, అశ్విని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని సమీకృత బాలికల వసతిగృహంలో తిరుమలగిరి, పెద్దవూర మండలాల్లోని ఎస్టీ హాస్టల్ , ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులకు ప్రేరణ తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి(ఏటీడీఓ) కదారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తి అయ్యాక ఏఏ కోర్సులు ఉంటాయి, ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం డీ.బాలోజీ, వార్డెన్లు కొల్లు బాలకృష్ణ, సంధ్యారాణి, రమేష్, శ్రీను, జానీ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు రాజ్యంలోనే పేదలకు న్యాయం


శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి, నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : కమ్యూనిస్టు రాజ్యంలోనే పేదలందరికీ సమన్యాయం దక్కుతుందని, అటువంటి రాజ్యస్థాపనకు ప్రజలు ఆలోచన చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు మంగళవారం సీపీఎం కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జూలకంటి రంగారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరికి, బానిసత్వానికి గురవుతున్న ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి ద్వారా అనేక గ్రామాల్లో దండోరా మోగించి నిజాంకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో అగ్రభాగాన నిలిచాడని గుర్తు చేశారు. అనంతరం పట్టణంలోని రవీంద్రనగర్‌లో వర్ధంతి సందర్భంగా ఆయన మనువరాలు డాక్టర్ నంద్యాల చరిత, నంద్యాల సృజన ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రామ్మూర్తి, మంగారెడ్డి, జగదీష్‌చంద్ర, సత్యనారయణరావు, వీరాచారి, రమేష్, సైదులు, రామకృష్ణ, రామారావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి

మిర్యాలగూడ : దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ అన్నారు. మంగళవారం దామరచర్లలో నిర్వహించిన పవర్‌ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన అధికారులకు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పవర్‌ప్లాంట్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం అందించడంతోపాటు కుటుంబాల్లోని యువతకు ప్లాంట్‌లో ఉద్యోగ, ఉపాధి కల్పించాలన్నారు. అసలైన భూనిర్వాసితులకు పరిహారం అందించకుండా అక్రమాలు జరిగాయని, ప్రభుత్వం చర్యలు తీసుకోని నిజమైన అర్హులకు పరిహారం అందించాలని కోరారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం


క్రీడలు ప్రారంభిస్తున్న ఎస్ఐ నర్సింహులు

పెద్దఅడిశర్లపల్లి : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు అన్నారు. మంగళవారం మండలంలోని అక్కంపల్లి ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో అంబేడ్కర్ కబడ్డీ సొసైటీ ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీ ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు వెలికి తీయడానికి దోహదం చేస్తాయన్నారు. మండలంలో కబడ్డీపై ఆసక్తిగా ఉన్న క్రీడాకారులకు అంబేడ్కర్ సొసైటీ ఉచితంగా శిక్షణ ఇచ్చి కబడ్డీ క్రీడాకారులుగా పెంపొందించేందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కళాచారి, ఉపాధ్యక్షులు రవి, నగేష్, గణేష్, అంజిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


పూజలను నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు

వేములపల్లి : మండలంలోని రావువారిగూడెంలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకాలు, భజన, మధ్యాహ్నం హారతి, పల్లకి సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాగిరెడ్డి ఉత్తరారెడ్డి, సుజాత, సుగుణమ్మ, సువర్ణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని మహిషాసురమర్ధిని, ముత్యాలమ్మ, అంకాలమ్మ అమ్మవార్ల ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, పంచ్యగవ్య విధి, రక్షాబంధనం, దీక్షాదారణ, అఖండా దీపాస్థపనను నిర్వహించారు. సాయంత్రం యాగశాల ప్రవేశం, అంకురారోపణ, నవగ్రహా మండ ఆరాధన, వాస్తూ పూజలు, హోమం, నవగ్రహా హోమాలు, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. వెల్లూటూరి జగన్‌మోహన్ శర్మ, రాంమోహన్ శర్మలు పర్యవేక్షణలో అంగరంగంగా నిర్వహించారు.

రైతులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలి

అడవిదేవులపల్లి : ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా లబ్ధిదారులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలని మిర్యాలగూడ వ్యవసాయ సహాయ సంచాలకులు పోరెడ్డి నాగమణి కోరారు. మంగళవారం మండలంలోని గోన్యతండా, అడవిదేవులపల్లి గ్రామాల్లో రైతులతో పరిశీలించి మాట్లాడారు. సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లేకపోవడంతో సమీపంలోని సీఎస్‌సీ సెంటరును సంప్రదించాలన్నారు. అనంతరం అడవిదేవులపల్లిలోని పోస్టాఫీసును సందర్శించి ఎన్‌పీసీఐ, ఆధార్ ఫీడింగ్ లేని రైతులు కొత్త పోస్టాఫీసులో కొత్త అకౌంట్‌ను తీయించి ఈ కేవైసీ చేయించారు. ఆమె వెంట వ్యవసాయ అధికారి అర్చన, ఏఈఓలు మహేష్‌నాయక్, రావుల నరేష్‌లతో పాటు రైతులు తదితరులు ఉన్నారు.